సాక్షి ఒడిశా

శుక్రవారం । 9 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,72,139లు, బంగారం 4 గ్రాముల 450 మిల్లీగ్రాములు, వెండి 115 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వ్యాపారి కిడ్నాప్ గుట్టురట్టు

జయపురంలో వ్యాపారి కిడ్నాప్ కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను పట్టుకున్నారు.

- 10లో



విపత్తు నిరోధక రోడ్లు

రాష్ట్రంలో విపత్తు నిరోధక రోడ్లు నిర్మించనున్నారు. ఈ మేరకు ప్రకటించారు.

- 10లో

న్యూస్‌రీల్

విమాన సేవలు రద్దు



భువనేశ్వర్: జాతీయ భద్రతా వైమానిక సరిహద్దుల కారణంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన సేవలు ప్రభావితం అయ్యాయి. గురువారం ఇక్కడ నుంచి బయల్దేరాల్సిన 2 విమాన సేవలు రద్దు చేశారు. ప్రభావితమైన 2 విమానాల్లో హిండన్ (ఘజియాబాద్)కు వెళ్లే విమానం, పాట్నా నుంచి భువనేశ్వర్ మీదుగా చండీగఢ్‌కు వెళ్లే విమానం ఉందని డైరెక్టర్ ప్రసన్న ప్రధాన్ తెలిపారు. భువనేశ్వర్ నుంచి ఘజియాబాద్ హిండన్‌కు వెళ్లే విమానం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రద్దు చేయబడింది. సాంకేతిక లోపాల కారణంగా పాట్నాకు వెళ్లే మరో విమానాన్ని తాత్కాలికంగా వరుసగా రెండో రోజు రద్దు చేశారని వివరించారు. ఇతర విమానాలు మరియు కార్యకలాపాలు సాధారణంగా పనిచేస్తున్నాయి. భయపడాల్సిన అవసరం లేదని విమానాశ్రయ డైరెక్టర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు నడిపేందుకు అనుమతివ్వండి



వినతిపత్రం అందజేస్తున్న ట్రాక్టర్ యజమానుల సంఘం సభ్యులు

రాయగడ: పగటిపూట ఇసుక ట్రాక్టర్లను నడిపేందుకు అనుమతినివ్వాలని కోరుతూ స్థానిక మా మజ్జిగౌరి ట్రాక్టర్ యజమానుల సంఘం జిల్లా యంత్రాంగానికి కోరింది. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్‌కు సంఘం సభ్యులు వినతిపత్రం గురువారం అందజేశారు. రాత్రి వేళల్లో ఇసుక ట్రాక్టర్లు, భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతుండడంతో ట్రాక్టర్లకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఎదురుగా వచ్చే భారీ వాహనాల లైట్ల వలన ఒక్కోసారి చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పద్మనాభ దాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భాస్కరాచార్యులు

రాయగడ: స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో వైశాఖ మాస ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలతో పాటు శ్రీరమా సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.

అమిత్ షా ఒడిశా పర్యటన వాయిదా

భువనేశ్వర్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన వాయిదా పడింది. బీజేపీ ఎమ్మెల్యే జయ నారాయణ మిశ్రా ఈ విషయం వెల్లడించారు. లోగడ ప్రకటించిన కార్యక్రమం ప్రకారం ఈ నెల 10వ తేదీన అమిత్ షా రాష్ట్రంలో రెండు రోజులు పర్యటించాల్సి ఉంది. భారత్, పాకిస్తాన్ ఉద్రిక్త పరిస్థితుల కారణంగా పర్యటన వాయిదా పడింది.

అబుదాబికి విమాన సేవలు

భువనేశ్వర్: భువనేశ్వర్ నుంచి అబుదాబికి ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. కొత్త గమ్యస్థాన విధానం (న్యూ డెస్టినేషన్ పాలసీ) కింద భారత ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. ఈ సౌకర్యం ఈ ఏడాది జూన్ నెల నుంచి ప్రారంభం కానుందని ప్రకటించారు. వారానికి 3 రోజులు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. మంగళ, గురు, శనివారాల్లో భువనేశ్వర్, అబుదాబి మధ్య విమానయాన సౌకర్యం ఉంటుంది.



మహిళలు నీరు తోడుతుంటే పందులు అదే నీటిని తాగుతున్న దృశ్యం

ఇదా స్వాతంత్ర్య ఫలం..

గుక్కెడు నీటి కోసం పందులతో పోటీ పడాలా..?
దప్పిక తీర్చుకోవడానికి జలపాతాలపై ఆధారపడాలా..?
గొంతు తడుపుకోవడానికి అడవంతా తిరగాలా.?
ఇదా 75 ఏళ్ల స్వాతంత్ర్య ఫలం..?
ఇదా కట్టే పన్నులకు ప్రతిఫలం..?
ప్రశ్నించే గొంతు లేదని, నిలదీసే మనిషి లేదని, ఎదురించే గుండె లేదనేనా ఈ నిర్లక్ష్యం.

మల్కన్‌గిరి జిల్లా ఖొయిర్‌పుట్ సమితిలోని బొండా గిరిజనుల అవస్థలివి. కాలంలో సంబంధం లేకుండా ఎన్నో ఏళ్లుగా వీరి ఈ నీటినే తాగుతున్నారు. నేతలు మారుతున్నా వీరి తలరాతలు మాత్రం మారడం లేదు. బోండా ఘాటీపై రెండు పంచాయతీలు ఆంద్రాహల్, ముదిలిపోధలో 32 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 70 బోర్లు ఉన్నాయి. కానీ చాలా వరకు పనిచేయడం లేదు. బోరు కొడితే కిలుం పట్టిన ఇనుప ముక్కలు బిందెలో పడుతున్నాయి. ఫలితంగా జంతువులతో పోటీ పడుతూ ఇలా నీరు తీసుకెళ్లాల్సి వస్తోంది.

– మల్కన్‌గిరి



వేసవి నీటి కోసం కష్టపడుతున్న బోండా మహిళలు



ఒక జలపాతం వద్దనే అంట్లు తోముతున్న మహిళలు

పర్లాకిమిడిలో రథయాత్రకు సన్నాహాలు



రథయాత్రపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: వచ్చే నెలలో జరగనున్న శ్రీజగన్నాథ రథయాత్రకు స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో ముందస్తు సమావేశం, సమీక్ష కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి అతిథిగా మోహనా ఎమ్మెల్యే దావరథి గోమాంగో, సబ్ కలెక్టర్ అనుప్ పండా, సబ్‌డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, తహసీల్దారు నారాయణ బెహరా, సీనియర్ సిటిజన్ పూర్ణచంద్ర మహాపాత్రో, రథయాత్ర కమిటీ సభ్యులు, ఇతరులు పాల్గొన్నారు. గత రథయాత్ర పర్లాకిమిడిలో శాంతియుతంగా జరుపుకున్నామని, అప్పటి జమాఖర్చులు సబ్‌కలెక్టర్ అనుప్ పండా సభకు వివరించారు. ఈ ఏడాది రథయాత్రకు రథాల నిర్మాణం, కలప ఆవశ్యకత ఉందని రథయాత్ర కమిటీ కలెక్టర్ దాస్‌కు వివరించారు. రథయాత్ర జరుగు గుండిచా మందిరం వద్ద మీనాబజార్, జెయింట్ వీల్స్‌కు టెండర్లు పిలవడం, అలాగే రథయాత్ర ప్రసాద కమిటీకి కూడా టెండర్లు పిలవాలని కలెక్టర్ ఆదేశించారు. రథయాత్రలో పారిశుద్ధ్య వ్యవస్థ, తాగునీరు, ప్రజలకు పోలీసు భద్రత, అంబులెన్సు, అగ్నిమాపకదళం వంటివి ఏర్పాటు చేయాలని ఆయా శాఖలకు కలెక్టర్ ఆదేశించారు. అలాగే రథయాత్ర కమిటీలో కొన్ని మార్పులు చేశారు. రథయాత్రలో ట్రాఫిక్ వేరే వైపు మళ్లింపు, శాంతి భద్రతలు కాపాడటానికి పోలీసు అధికారులను ఆదేశించారు.

పికప్ వ్యాన్ బోల్తా

- పది మందికి గాయాలు



అంబొదల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదల పోలీస్ స్టేషన్ పరిధిలో గల మంజూరికుపా వద్ద గురువారం ఒక పికప్ వ్యాన్ బోల్తా పడింది. ఘటనలో పది మంది గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలకు గురైన మరి కొంతమందికి సమీపంలో గల భవానీపట్నంకు తరలించారు. ప్రమాదానికి కారణమైన పికప్ వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... వీధివీధుల్లో తిరిగి గాజులు,పూసలు వంటి చిరువ్యాపారాలు చేసుకునే 20 మంది గురువారం ఉదయం అంబొదల నుంచి మునిగుడ వరకు వెళ్లేందుకు అటు వైపుగా వస్తున్న పికప్ వ్యాన్ ఎక్కారు. మంజూరికుపా ప్రాంతానికి వ్యాన్ వచ్చే సరికి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికుల్లో 10 మంది గాయాలకు గురయ్యారు. వీరంతా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన బలరాంపూర్ జిల్లా రాజ్‌పూర్ ప్రాంతానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.

వరల్డ్ స్కిల్ సెంటర్ సందర్శన



విద్యార్థులతో గవర్నర్ హరిబాబు సంభాషణ

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి స్థానిక వరల్డ్ స్కిల్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. ఈ సముదాయంలో వివిధ ప్రయోగశాలలను సందర్శించి, విద్యార్థులతో శిక్షణ గురించి సంభాషించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మౌలిక సదుపాయాలు మరియు పాఠ్యాంశాలను పరిశీలించారు. ఆయనతో పాటు సంస్థ డివిజనల్ సెక్రటరీ భూపేంద్ర సింగ్ పుణియా, వరల్డ్ స్కిల్స్ సెంటర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఓఎస్డీ రష్మిత పాండా తదితరులు ఉన్నారు.

ఈకోర్సా ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడిన ఈకోర్సా సభ్యులు

భువనేశ్వర్: భారత సాంకేతిక సంస్థ (ఐఐటీ) భువనేశ్వర్ సహకారంతో తూర్పు కోస్తా రైల్వే క్రీడా సంఘం (ఈకోర్సా) ఖుర్దారోడ్ శాఖ ఖుర్దారోడ్ హాఫ్ మారథాన్ భువనేశ్వర్ 2025 నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమం జూన్ 1, 2025 ఆదివారం ఉదయం 4.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఐఐటీ భువనేశ్వర్ నుంచి యూ టర్న్‌తో రైల్వే స్టేడియం వద్ద ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వర్గాలు 15 నాటికి వివరాలు నమోదు చేసుకోవాలని ఈకోర్సా ఉపాధ్యక్షుడు పీకే బెహరా తెలిపారు. ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి (డీఆర్ఎం) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హాఫ్ మారథాన్ సంబంధిత వివరాల్ని వెల్లడించారు. పుష్కలమైన ఆరోగ్యం, సామాజిక బంధం ప్రోత్సహించే దిశలో అన్ని వర్గాల ఔత్సాహికులకు ఈ కార్యక్రమంలో అవకాశం కల్పిస్తున్నారు. నాలుగు వర్గాల కింద మారథాన్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ వర్గాల్లో విజేతలకు నగదు బహుమతులు ప్రకటించారు. 21.1 కిలో మీటర్ల హాఫ్ మారథాన్‌లో పురుష – స్త్రీ విభాగాలకు వయస్సు ఆధారంగా వరుసగా రూ. 12000, రూ. 9000, రూ. 6000 నగదు బహుమతులు, 10 కిలో మీటర్ల పరుగు విభాగంలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు రూ. 10,000, 7000, రూ.5000 నగదు బహుమతులు అందజేస్తారు.

కొత్త రిజర్వేషన్ టికెట్ కౌంటర్ ఏర్పాటు



భువనేశ్వర్ కొత్త రైల్వేస్టేషన్

భువనేశ్వర్: ప్రయాణికుల సౌకర్యానికి భువనేశ్వర్ న్యూ రైల్వే స్టేషన్‌లో కొత్త రిజర్వేషన్ రిజర్వేషన్ కేంద్రం (పీఆర్ఎస్) ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రం ఈ నెల 12వ తేదీ నుంచి ఆరంభం అవుతుందని ఖుర్దారోడ్ రైల్వే మండలం ప్రకటించింది. ఈ కేంద్రం సోమవారం నుంచి శనివారం వరకు 6 పని దినాలలో నిత్యం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరవధికంగా పని చేస్తుంది. దీనితో ఉత్తర భువనేశ్వర్, అఠొగొడా, కటక్ ప్రాంతాల ప్రయాణికులకు ఈ రిజర్వేషన్ కేంద్రం లబ్ధి చేకూర్చుతుంది. ప్రస్తుతం 11 జతల ప్రయాణికుల రైళ్లు భువనేశ్వర్ న్యూ స్టేషన్‌లో ఆగుతున్నాయి. ఈ నెల 12 నుంచి మరో మూడు జతల ఎక్స్‌ప్రెస్ రైళ్లు భువనేశ్వర్, సీఎస్ఎంటీ ముంబై మధ్య నడుస్తున్న 11020/11019 కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్, సికింద్రాబాద్ మధ్య రాకపోకలు చేస్తున్న 17015/17016 విశాఖ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్, విశాఖపట్నం మధ్య రవాణా అవుతున్న 22819/22820 ఇంటర్ సిటీ సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రస్తుత భువనేశ్వర్ ప్రధాన స్టేషన్‌కు బదులుగా భువనేశ్వర్ న్యూ స్టేషన్‌లో ప్రారంభమై ముగుస్తాయి. పీఆర్ఎస్ మూసివేత భువనేశ్వర్ న్యూ స్టేషన్ ప్రాంగణంలో కొత్త పీఆర్ఎస్ ప్రారంభంతో బారంగ్ రైల్వే స్టేషనులో పని చేస్తున్న ప్యాసింజర్ రిజర్వేషన్ టికెట్ కౌంటర్ మూసి వేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ రోల 10వ తేదీ నుంచి ఈ కేంద్రం మూసివేస్తారు.

టీచర్ల రక్తదానం



కలెక్టరేట్ నుంచి విద్యార్థులు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ ర్యాలీ



రక్తదాన శిబిరం

పర్లాకిమిడి: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ వద్ద గురువారం ఉదయం ఒక అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాల్‌లో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాలనాధికారి బిజయ కుమార్ దాస్ పాల్గొని జాన్ హెన్సీ డునాంట్ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. రెడ్ క్రాస్ ద్వారా ప్రజల్లో మానవతను చాటిచెప్పాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, లైఫ్ మెంబర్సు రక్తదానం చేసి బ్లడ్ బ్యాంకు తరలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా, సి.డి.యం.ఓ. (డి.పి.హెచ్.)డాక్టర్ మహ్మద్ ముబారక్ ఆలీ, జలసంరక్షణ ప్రాజెక్టు అధికారి సురేష్ పట్నాయిక్, ఆర్టీఓ ప్రసన్న కుమార్‌దాస్, జిల్లా పాఠశాలల సీఈటీ సురేంద్ర కుమార్ పాత్రో ఇతరులు పాల్గొన్నారు.

ఒంటరి పెద్దలకు సహాయం



పోలీసు ఉన్నతాధికారుల అధ్యక్షతన వయో వృద్ధుల సమావేశం



సమావేశానికి హాజరైన వయో వృద్ధులు

భువనేశ్వర్: వయో వృద్ధులకు సకాలంలో సహాయం అందజేసేందుకు పూరీ పోలీసులు ముందుకు వచ్చారు. ప్రధానంగా వేరే పెద్ద దిక్కు లేకుండా ఒంటరిగా ఇండ్లలో ఉంటున్న వయో వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయంలో స్థానిక వయో వృద్ధులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు. వారి సమస్యల్ని పరిశీలించి నిరంతరం సత్వర సహాయం అందుబాటులో ఉంటుందని అభయం ఇచ్చారు. సీనియర్ సిటిజన్లు ఏవైనా సమస్యలను నివేదించడానికి లేదా సహాయం కోరడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 6370972100 పని చేస్తుందన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

జయపురం: చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్‌ను రాష్ట్రంలోని అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. గురువారం నిర్వహించిన జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.8.40 కోట్ల వ్యయంతో సాగర్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిరంతరం పనిచేసి నిర్ధారిత 6 నెలల సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సాగర్‌లోని 147 ఎకరాల్లో బురద తొలగించేందుకు అనుమతి లభించిందని కార్యనిర్వాహక అధికారి అక్కవరం శౌర్య రెడ్డి వెల్లడించారు. గతంలో 47 ఎకరాల్లో బురద, మట్టి తొలగించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ వి.కార్తీక వాసన్ మాట్లాడుతూ.. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కంట్రాక్ట్ సంస్థకు ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, కౌన్సిలర్లు విష్ణు వర్ధన రెడ్డి, రవీంద్ర కుమార్ సాహు, మున్సిపాలిటీ ఇంజినీర్ అజయ కుమార్ జాని, ప్రతాప్ చంద్ర ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి వేతనదారు మృతి


పార్వతి(ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు అనపాన పార్వతి(45) గురువారం మృతిచెందింది. గ్రామ సమీపంలో ఉపాధి పని చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తోటి కూలీలు వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహిస్తుండగా మృతిచెందింది. వడదెబ్బ తగలడం వల్లే మృతిచెంది ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పార్వతికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామం వద్ద అలికాం–బత్తిలి రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కర్లెమ్మ గ్రామానికి చెందిన బొడ్డు నానాజి, తన భార్యతో కలిసి భామిని నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న యువకుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో దంపతులు, యువకుడు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీలో చేర్పించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బి.గోవిందరావు తెలిపారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్‌గా తాతయ్య


చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జేడీ రాజ్‌గోపాల్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం జిల్లా చైర్మన్‌గా కుజ్జ తాతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఈడీ డాక్టర్ బి.యోగేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలో పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఎన్నికల అధికారి డాక్టర్ పి.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ ఎన్నికలో సంఘం ఉపాధ్యక్షులుగా పల్ల నరహరితో పాటు 11మంది సభ్యుల్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జేడీ బి.రాజ్‌గోపాల్, పర్సన్ ఇన్‌చార్జి డాక్టర్ టి.పి.మనోజ్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా, సంఘంలో 123 మంది ఓటర్లు ఉన్నప్పటికీ నామమాత్రంగా హాజరై ఎన్నిక మమా అనిపించేశారు. మంత్రి సిఫార్సు చేసిన వారికే చైర్మన్, ఉపాధ్యక్ష పదవుల్ని కట్టబెట్టారని పలువురు సంఘ నాయకులు ఆరోపించడం గమనార్హం.

ఆదిత్యుని సన్నిధిలో సినీ గాయకులు శ్రీకృష్ణ, యామిని


జ్ఞాపికను అందుకుంటున్న గాయకులు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామిని ప్రముఖ సినీ గాయకులు శ్రీకృష్ణ, యామినిలు గురువారం దర్శించుకున్నారు. తొలిసారిగా ఆదిత్యున్ని దర్శించుకోవడం నిజంగా తమ అదృష్టమని వారు తెలియజేశారు. వీరికి ఆలయ అధికార వర్గాలు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితా డీఈఓ అధికారిక వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయ పనివేళల్లో తగిన ఆధారాలతో సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించి తాత్కాలిక సీనియారిటీ జాబితాపై ఆర్జేడీ కార్యాలయంలో అభ్యంతరాలను ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తగిన ఆధారాలతో సమర్పించాలని డీఈఓ పేర్కొన్నారు.

రాష్ట్రంలో విపత్తు నిరోధక రోడ్ల నిర్మాణం

- రూ. 1,500 కోట్లు వ్యయ ప్రణాళిక
- మంత్రి మండలి ఆమోదం


మంత్రి మండలి సమావేశంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: వరదలు, తుఫాన్లకు గురయ్యే ప్రాంతాలలో 500 కిలోమీటర్ల పొడవునా విపత్తు నిరోధక రహదారులను నిర్మించడానికి రాష్ట్ర మంత్రి వర్గం రూ.1,000 కోట్లు, గ్రామీణ ప్రాంతాల నవీకరణలకు రూ. 426 కోట్ల వ్యయ ప్రణాళికను ఆమోదించింది. ముఖ్య మంత్రి సడక్ యోజన కింద ఈ ప్రాజెక్ట్‌ని 2025 – 2030 పంచ వర్ష ప్రణాళికగా పరిగణించారు. విపత్తు వంటి అత్యవసర పరిస్థితుల్లో నిరంతర రాకపోకల అనుసంధానం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా పేర్కొన్నారు. వరద స్థాయిల కంటే ఎత్తుగా బలోపేతమైన రక్షణ గోడలతో పటిష్టమైన నీటి ప్రవాహ వ్యవస్థతో కోతకు గురవుతున్న ప్రాంతాల్లో విపత్తు నిరోధక రహదారులను నిర్మిస్తారు. కొండ చరియలు జారిపడే వాలు ప్రాంతాల్లో ఈ తరహా రహదారుల నిర్మాణం ప్రాధాన్యత సంతరించుకుంది.

142 నియోజకవర్గాల్లో గ్రామీణ రోడ్ల అభివృద్ధి

రానున్న మూడేళ్లలో 142 అసెంబ్లీ నియోజక వర్గాలలో గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేయడానికి రూ. 426 కోట్ల వ్యయ ప్రణాళికకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, ఆస్పత్రులు, మార్కెట్లకు రహదారి అనుసంధానం మెరుగుపరచడం ఈ ప్రతిపాదన లక్ష్యంగా పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి వర్గం 5 విభాగాల 8 ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది.

మంత్రి మండలి ఆమోదం పొందిన ప్రతిపాదనలు

- బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ పథకం అమలు.
- ప్రజారోగ్య సౌకర్యాలలో అనుబంధ సేవలను బలోపేతం చేసేందుకు నిర్మల్ 2వ దశను 5 సంవత్సరాల పాటు కొనసాగింపు.
- 5 సంవత్సరాల పొడిగింపుతో నిదాన్ 2వ దశ కింద ఉచిత రోగ నిర్ధారణ, డయాలసిస్ సేవలు.
- నియోజకవర్గాల వారీగా కేటాయింపు (సీడబ్ల్యూఏ) కొత్త పథకం అమలు.
- కొత్త పథకం 'ముఖ్య మంత్రి సడక్ యోజన – విపత్తు తట్టుకునే రోడ్లు' అమలు.
- ఓసీఎస్ (ఫించను) నియమాలు, 1992 లో సవరణ.
- ఒడిశా వెటర్నరీ టెక్నికల్ సర్వీస్ (నియామక, సేవా నిబంధనలు) నియమాలు, 2024 అమలు.
- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గం రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి బస్ సేవ (ఎంబీఎస్) అమలు ప్రతిపాదనకు ఆమోదించింది. ఈ ఆమోదంతో ఎంబీఎస్ కింద నడిచే ఏసీ, నాన్–ఏసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు, హిజ్రాలు, విద్యార్థులు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ లభిస్తుంది.

అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తాం


రేషన్ కార్డుదారులతో ఎమ్మెల్యే, అధికారులు

జయపురం: మున్సిపాలిటీ పరిధిలో రేషన్ కార్డులు అందజేసే కార్యక్రమం గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి అధ్యక్షతన ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి హాజరయ్యారు. ఆహార సురక్షా పథకంలో ప్రతి వార్డు నుంచి ఒక్కొక్క లబ్ధిదారుని ఎంపిక చేసి వారికి కార్డులు అందజేశారు. పట్టణంలో ఎన్నో కుటుంబాల వారిని ఎంపిక చేసినా కేవలం కొద్ది మందికే పిలవటం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఎంపిక చేసిన లబ్ధిదారులందరినీ పిలువకుండా కేవలం వార్డుకు ఒక్కరినే ఎందుకు పిలిచారని మార్కెటింగ్ ఇన్‌స్పెక్టర్‌ను నిలదీశారు. వెంటనే కొత్త లబ్ధిదారులను రప్పించి కార్డులు అందజేయాలని ఆదేశించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామన్నారు.

జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి అక్కవరం శౌశ్యా రెడ్డి, అదనపు కార్యనిర్వాహక అధికారి కృతిబాస్ సాహు, కౌన్సిలర్లు జస్‌పాల్ సింగ్, సింహాచల బిశాయి, మధుస్మిత ఒరాన్, ఉషారాణి దండసేన, మమతా బిశ్వాల్, శాంతి నాయక్, దనిమా హరిజన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా విలువలు అవసరం


కార్యక్రమంలో పాల్గొన్న సెంచూరియన్ వర్సిటీ అధికారులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలో సెంచూరియన్ వర్సిటీలో అధ్యాపకుల అభివృద్ధికి విశ్వ మానవతా విలువలు (యు.హెచ్.వీ) కార్యక్రమాన్ని క్యాంపస్‌లో వైస్ చాన్సలర్ సుప్రియా పట్నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో, డైరెక్టర్ (అడ్మిన్) డాక్టర్ దుర్గాప్రసాద్ పాడీ, డీన్ (అగ్రికల్చర్ కళాశాల) డాక్టర్ సత్యప్రకాష్ నందా హాజరయ్యారు. గురువారం ఉదయం యోగా క్లాసులతో ప్రారంభమైంది. యోగావల్ల అధ్యాపకులు, పరిశోధకులకు భౌతికంగా, మానసికంగా ఎక్కువ శక్తి కలుగుతుందని అధికారులన్నారు. సుమారు 118 మంది పాల్గొన్న ఈ ఫ్యాకల్టీ, పరిశోధకుల కార్యక్రమంలో విశ్వ విద్యాలయం కో ఆర్డినేటరు డాక్టర్ ప్రదీప్ కుమార్ సాహు, డాక్టర్ బాలాజీ పాడీ, ద్వితీసుందర్ రౌత్, ఏ.ఐ.సి.టి.ఈ ప్రాంతీయ కోఆర్డినేటరు డాక్టర్ దిలీప్ దేవానాథ్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌తో పాటు ఇథికల్, విశ్లేషణ, అధ్యాపకుల టీచింగ్‌లో మానవతా విలువలు గురించి ఏ.ఐ.సి.టి.ఈ అధికారులు తెలియజేస్తారు.


యోగాసనాల్లో పాల్గొన్న అధ్యాకులు, అధికారులు

వివాహిత ఆత్మహత్య

తాటిచెట్లపాలెం(విశాఖ): భర్త వేధింపులు భరించలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తండ్రి లుకలపు తిరుపతిరావు ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టెక్కలికి చెందిన శ్రావణిని బి.మాధవరావుకు ఇచ్చి వివాహం చేశారు. అనంతరం శ్రావణి కోరిక మేరకు ఆమెను విశాఖలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదివించారు. ఈ సమయంలో శ్రావణికి కొమర రోహిత్‌కుమార్‌తో స్నేహం ఏర్పడి, అది సన్నిహిత సంబంధానికి దారితీసింది. పెద్దల సమక్షంలో మాధవరావుతో విడాకులు తీసుకున్న శ్రావణి, ఆ తర్వాత రోహిత్‌కుమార్‌ను రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో వివాహం చేసుకుంది. వివాహం తర్వాత రోహిత్ ప్రవర్తనలో మార్పు రావడంతో శ్రావణిని వేధించడం ప్రారంభించాడు. రోహిత్‌కుమార్ భార్యను పోషించలేక ఆమె సంపాదించి తీసుకురావాలని ఒత్తిడి చేసేవాడు. సొంత ఖర్చులు కూడా ఆమెనే భరించాలని వేధించేవాడు. రోహిత్‌కుమార్ విశాఖ–హైదరాబాద్ తిరుగుతూ విశాఖ వచ్చినప్పుడల్లా వేధించేవాడు. పెళ్లయిన తర్వాత తనకు మనశ్శాంతి లేదని, చనిపోతే సంతోషంగా ఉంటానని రోహిత్ కుమార్ పదే పదే అనడంతో శ్రావణి తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది. ఈ నెల 5న శ్రావణి ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్లగా, పోలీసులు గుర్తించి ఆమె సోదరుడికి సమాచారం అందించారు. అనంతరం రోహిత్ కుమార్ ఆమెను హాస్టల్‌లో వదిలి వెళ్లిపోయాడు. బుధవారం శ్రావణి మత్తు మాత్రలు మింగడంతో మృతి చెందింది. తన కుమార్తెకు మృతికి కారణమైన రోహిత్‌కుమార్ చర్యలు తీసుకోవాలని శ్రావణి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువగళం హామీలు ఏమయ్యాయి?


నిరసన తెలియజేస్తున్న ఏబీవీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పేరిట విద్యార్థుల కోసం అనేక అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కటి కూడా అమలు చేయడం లేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి మండిపడ్డారు. ఏడాది కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పందించకపోవడం దారుణమన్నారు. యువగళం హామీలు ఏమయ్యాయంటూ జిల్లా కేంద్రంలోని సూర్యమహల్ కూడలిలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ లోకేష్ విద్యాశాఖ మంత్రి కాదని, ఫేక్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. విద్యా సంవత్సరం బకాయిలు వెంటనే చెల్లించి విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్రకార్యవర్గ సభ్యులు మదన్, శ్రీకాకుళం మండల కన్వీనర్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి


సంఘటన స్థలంలో రమేష్ మృతదేహం

మల్కన్‌గిరి: ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో మావో అగ్రనేతలు అరుణ, ఉదయ్ తప్పించుకున్నారు. అల్లూరి జిల్లా రామభద్రపురం పోలీసు స్టేషన్ పరిధిలోని దూముకొండ అడవిలో మావోల స్థావరం ఉందని పోలీసులు, గ్రేహౌండ్స్‌సిబ్బంది అడవిని జల్లెడ పడుతున్నారు. బుధవారం సరిహద్దు ప్రాంతంలో జవాన్లకు మావోలు తారసపడడంతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మరిగేట్ట గ్రామానికి చెందిన వాగా పడియామి అలియాస్ అలియాస్ రమేష్ నాగ్ మృతిచెందాడు. ఇతడిపై ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రూ.10 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు


అరెస్టు అయిన సైబర్ నేరగాళ్లు

మల్కన్‌గిరి: రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు సైబర్ నేరగాళ్లను మల్కన్‌గిరి జిల్లా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మల్కన్‌గిరి జిల్లా కేంద్రం దుర్గాగుడి వీధికి చెందిన ఆటక్ కుమార్ త్రిపాఠి ఐడీ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్‌లు ఇతర కార్డులను రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు యువకులు ఫేక్‌వి తయారు చేశారు. ఆశోక్ ఖాతా నుంచి 2024 అక్టోబర్ నుంచి డబ్బులు తీసేశారు. ఈ విషయాన్ని మల్కన్‌గిరి పోలీసులకు అశోక్ ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి దర్యాప్తు చేస్తున్నారు. చివరికి ఈ ముగ్గురు నిందితులు ముకేష్ కుమార్ (22), సురేంద్రమ్ (20), నరేష్ (21) సైబర్ నేరగాళ్లు.. ముఖేష్ కుమార్ ఖాతాలో రూ.4,50,000 జమ చేసుకున్నారు. మందన్ ఖాతాలో రూ.2లక్షలు జమ చేశారు. ఈ మొత్తం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిని ముంబైలో ఈ నెల 5న అరెస్టు చేశారు. గురువారం మల్కన్‌గిరి తీసుకువచ్చారు. ప్రత్యేక బృందం పోలీసులు పూర్తి విచారణ అనంతరం వివరాలు తెలుస్తాయని జిల్లా ఎస్పీ వినోద్ పటేల్ తెలిపారు.

ఒకే దేశం, ఒకే ఎన్నికతో ఎన్నో లాభాలు


మాట్లాడుతున్న గౌతమ్ సామంతరాయ్

జయపురం: ఒకే దేశం, ఒకే ఎన్నికలకు కేంద్ర ప్రతిపాదనవలన దేశానికి ఎన్నో లాభాలు ఉన్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.గురువారం స్థానిక హోటల్‌లో భారతీయ జనతా పార్టీ ఒక దేశం, ఒకే పార్టీ అంశంపై కార్యక్రమం నిర్వహించింది. కొరాపుట్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు సుమంత ప్రధాన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే ఎన్నిక అమలు చేస్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. లోక్ సభకు, దేశంలో అన్ని రాష్ట్రాల శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే సమయం, ఖర్చు తగ్గుతుందన్నారు.

ఎప్పటికప్పుడు ఎన్నికలు జరిపితే అధికార యంత్రాంగ సమయం, ఆర్థిక వ్యయం జరుగుతుందన్నారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ కార్యదర్శి సౌమేంద్ర జెన, రాష్ట్ర బీజేపీ ప్రవక్త రాజేష్ పట్నాయక్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ శాశ్వత సభ్యులు గౌతమ్ సామంతరాయ్, ఇంజినీర్ కేదార్ నాథ్ బెహరా, పొట్టంగి విధాన సభ బీజేపీ నేత నందబలి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.


యోగా పోటీలకు హాజరైన విద్యార్థులు

యోగాతో మానసిక ఉల్లాసం


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


మాట్లాడుతున్న హెచ్‌ఎం పట్నాయక్

జయపురం: జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం జయపురం బ్లాక్ స్థాయి యోగా ఒలింపియాడ్ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ప్రకాశ్ చంద్ర పట్నాయక్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జయపురం బ్లాక్ విద్యాధికారి చందన నాయక్, గౌరవ అతిథిగా బ్లాక్ సహాయ విద్యాధికారి ప్రియంబద పాత్రో హాజరయ్యారు. యోగా ప్రాధాన్యత, యోగా వలన శారీరక, మానసిక వికాశానికి కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. క్రీడా ఉపాధ్యాయులు ప్రశన్న పాణిగ్రహి, శుబేందు ప్రధాన్, పి.రాజేశ్వరి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. జూనియర్ల పోటీలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శుబ్రతా సాహు, మున్సిపాలిటీ ఉన్నత పాఠశాల విద్యార్థి మాన్యతా పాత్రో విజేతలుగా నిలిచారు. సీనియర్ల గ్రూప్ పోటీల్లో రొండాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి వికాశ బారిక్, జయపురం మున్సిపాలిటీ బాలికోన్నత పాఠశాల విద్యార్థి ఆరతి గౌడలు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలలో న్యాయ నిర్ణేతలుగా క్రీడా ఉపాధ్యాయురాలు రీటా సామంతరాయ్, తాపస కుమార్ మహంతి, క్రీడా ఉపాధ్యాయులు శుబేందు కుమార్ ప్రధాన్ వ్యవహించారు.


యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

వ్యాపారి కిడ్నాప్ గుట్టురట్టు


కిడ్నాపర్ల నుండి స్వాధీన పరచుకున్న నాటు తుపాకీ , తూటాల మాగజైన్ సెల్ ఫోనులు


మీడియ ప్రతినిధులకు కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీఓ కాశ్యప్‌తో పాటు, సదర్‌పోలీసు అధికారి

జయపురం: జయపురం వ్యాపారి డీసీ రాజు కిడ్నాప్ చిక్కుముడిని పోలీసులు విప్పారు. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీస్ కశ్యప్ తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. అరెస్టయిన నిందితులు బొరిగుమ్మ సమితి బిసింగపూర్ పోలీసు స్టేషన్ పరిధి రంపుడిపొదర గ్రామం కమర దిశారి(25), కమరాగుడ గ్రామం కమళ లోచన హరిజన్ ఉరఫ్ దుబులు(25), జయపురం సదర్ పోలీసు స్టేషన్ ఉమ్మరి పంచాయితీ మొకాపుట్ సురేంద్ర ఖోశ్ల(25), సనముజురుముండ గ్రామం దేవేంద్ర నాగ్(26), ఉమ్మిరీ గ్రామం ప్రతాప్ బెహర(26), ఉమ్మిరి గ్రామం కరణ నాయి(20) లు అని వెల్లడించారు. వారి నుంచి ఒక నాటు తుపాకీ మూడు పేలని మూడు తూటాలు, బంగారం, బైక్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఆయన కేసు వివరాలు వెల్లడిస్తూ గత మార్చి నెల 21న వ్యాపారి రాజును కిడ్నాప్ చేశారని ఆ మేరకు అతని కుమారుడు ఎ.పవన్ కుమార్(31) ఫిర్యాదు చేశారని వెల్లడించారు. వెంటనే తాము దర్యాప్తు ప్రారంభించామని, దుండగులు డీసీ రాజుని నాలుగు చక్రాల వాహనంలో ఘాట్‌గుడ నుంచి బిసింగపూర్ రామపుడి పొదర్ వద్ద పర్వత శిఖరం పైకి తీసుకెళ్లారని తెలిపారు. అక్కడ రాజు వద్ద నుంచి నగదు, బంగారం, మొబైల్ లాక్కున్నారని, బాధితుడిని మరో ప్రాంతానికి తీసుకుపోవాలనుకున్న సమయంలో అతడు తప్పించుకున్నారని తెలిపారు. పోలీసులు ఆ ప్రాంత ప్రజలను విచారించగా వివరాలు తెలిశాయన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితునితో పాటు కొంత మంది పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.


పట్టుబడిన కిడ్నాపర్లు



భక్తిశ్రద్ధలతో జలయాత్ర

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు పురుషోత్తపురంలో విశ్వశాంతి ఏకకుండి వైష్ణవ మహాయజ్ఞంలో భాగంగా మహిళలంతా కలిసి జలయాత్ర చేపట్టారు. గురువారం బాహుదా నదిలో మంత్రోచ్ఛారణలతో గంగాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలతో నదీజలాలను ఊరేగింపుగా పురుషోత్తపురం గ్రామానికి తీసుకొచ్చారు. –ఇచ్ఛాపురం

క్లుప్తంగా

ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: నాలుగేళ్ల క్రితం జిల్లాలోని బొబ్బిలి పీఎస్ పరిధిలో నమోదైన కేసులో విచారణ అనంతరం ముద్దాయికి విజయనగరం మహిళా కోర్టు పదేళ్ల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధించినట్టు ఎస్పీ వకుల్ జిందల్ గురువారం వెల్లడించారు. ఆ కేసుకు సబంధించి ఎస్పీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి మండలంలోని సీతయ్య పేటకు చెందిన దివనాపు అఖిల్ అంబేడ్కర్(29) పాచిపెంటకు చెందిన ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నానంటూ ఆమెకు దగ్గరై వాంఛలు తీర్చుకున్నాడు. తీరా పెళ్లి చేసుకోమని అడగ్గా నిరాకరించడంతో 2022లో బొబ్బిలి పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి సీఐ నాగేశ్వరరావు కేసున మోదు చేసి దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం మహిళ కోర్టు ఐదవ ఏడీజే పద్మావతి ముద్దాయికి శిక్ష విధించారని ఎస్పీ చెప్పారు.

ఏపీజీఈఏ ఉపాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్


ఏపీజీఈఏ ఉపాధ్యక్ష, కార్యదర్శిగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా ఉపాధ్యక్షుడిగా ట్రెజరీ శాఖ నుంచి పీఎస్. కిరణ్‌కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీగా ముదిలి ఆదినారాయణలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వి. యుగంధర్, పట్టణ జాయింట్ సెక్రటరీ పి. సురేష్‌బాబు, గజపతినగరం తాలుకా అధ్యక్షుడు బి.సింహాచలం, ఉప ఖజానా అధికారులు ఐ.రమేష్, సురేష్, శతపతిలు అభినందనలు తెలియజేశారు.

అతి ఉత్కృష్ట సేవా పతకం


ఎస్పీ చేతుల మీదుగా పతకం అందుకుంటున్న రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి

విజయనగనరం క్రైమ్: పోలీస్‌శాఖలో కమ్యూనికేషన్ వింగ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి రిటైర్ అయిన పివీ.రమణమూర్తికి అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం అందజేశారు. పోలీస్‌శాఖలో సుదీర్ఘంగా ,క్రమశిక్షణతో, సంతృప్తికరంగా, నిస్వార్థంగా విధులు నిర్వహించిన సిబ్బందికి కేంద్రప్రభుత్వం అతి ఉత్కృష్ట సేవా పతకం అందిస్తుందని ఈ సందర్భంగా ఎస్పీ చెప్పారు. శాఖలో కమ్యూనికేషన్ వింగ్‌లో నిస్వార్థంగా 38ఏళ్లు పని చేసిన రమణమూర్తి ఎంతో నిజాయితీగా క్రమశిక్షణగా విధులు నిర్వహించారని ఎస్పీ ఈ సందర్భంగా అన్నారు. అప్పట్లోనే ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి సేవలను గుర్తించి పథకం జాబితాకు పేరు పంపారని ఎస్పీ గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్ యాదవ్, పీవీ రమణమూర్తి, కిరణ్మయి పాల్గొన్నారు.

గంజాయి కేసులో నాలుగో నిందితుడి అరెస్ట్

రామభద్రపురం: గత ఏడాది డిసెంబర్ 12వ తేదీన ఒడిశా నుంచి మధ్యప్రదేశ్‌కు అక్రమంగా గంజాయి రవాణాచేస్తున్న నిందితుల్లో నాలుగో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ కె నారాయణరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని కొట్టక్కి పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా అప్పట్లో ఒడిశా నుంచి మధ్యప్రదేశ్‌కు అక్రమంగా రవాణాచేస్తున్న 830 కిలోల గంజాయి, లారీ, మహీంద్రా వ్యాన్, బొలెరో, కారుతో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారన్నారు. ఆ ముగ్గురిని విచారణ చేయగా ఈ అక్రమ రవాణాలో 9 మంది ఉన్నట్లు తెలిసిందన్నారు. తొమ్మిది మందిలో నాలుగో వ్యక్తి ఎ-6 నిందితుడు ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్ పోండాయ గ్రామానికి చెందిన దిలీప్ దసర్ బారక్ స్థానిక బైపాస్ రోడ్డులో సంచరిస్తుండగా గురువారం పట్టుపడ్డాడన్నారు. దీంతో నిందితుడిని సాలూరు కోర్టుకు తరలిస్తున్నామని చెప్పారు. మిగిలిన ఐదుగురు నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఆహ్వానపు నాటిక పోటీలు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. గరివిడి శ్రీరాం హైస్కూల్ వేదికగా నేటి నుంచి మూడు రోజుల పాటు నాటిక పోటీల ప్రదర్శన సాగనుంది. ఈ మేరకు గరివిడి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిరోజు శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు హైదరాబాద్‌కు చెందిన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారు 'స్వేచ్ఛ', హైదరాబాద్‌కు చెందిన మిత్ర క్రియేషన్స్ వారు 'ఇది రహదారి కాదు' అనే నాటికలు ప్రదర్శిస్తారు. మొదటిరోజు జరగనున్న కార్యక్రమంలో సినీనటుడు నారాయణమూర్తి, నరసింహరాజుపాల్గొననున్నారు.

పట్టుబడిన ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు

- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- సుమారు రూ.5లక్షల సొత్తు స్వాధీనం


ట్రాన్స్‌ఫార్మర్లలో గల కాపర్ వైర్, చోరీకి గురైన వస్తువులను, నిందితులను హాజరుపరిచిన సీఐ ఎల్.అప్పలనాయుడు

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, జామి మండలాలతో పాటు విజయనగరం రూరల్ పరిధిలో గల పలు గ్రామాల్లో గడిచిన మూడు నెలల నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు (16 కేవీ సామర్థ్యం) చోరీకి గురవుతున్న అంశం పోలీసులకు సవాల్‌గా మారింది.దీంతో పోలీసులు ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు వేపాడ మండలంలోని అరకు-విశాఖ రోడ్డులో పాటూరు జంక్షన్ వద్ద ఆటోలో చోరీ సొత్తును తరలిస్తుండగా గురువారం పట్టుబడ్డారు. ఈ విషయమై సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు నిందితులను, చోరీ సొత్తును విలేకరల సమావేశంలో ప్రదర్శించారు. ఈ కేసులకు సంబంధించి సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాల మేరకు గడిచిన మూడు నెలల వ్యవధిలో ఎస్.కోట రూరల్, సర్కిల్ పరిధిలో వేపాడ మండలంలో-2, లక్కవరపుకోట మండలంలో-3, జామి మండలంలో-4, కొత్తవలస మండలంలో -2, విజయనగరం రూరల్ పరిధిలో ఒకటి మొత్తంగా 15 ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురయ్యాయి, ఈ మేరకు అప్పట్లో కేసులు నమోదు చేయగా దర్యాప్తు చేయగా వేపాడ మండలం పాటూరు గ్రామానికి చెందిన రుద్ర బంగారు నాయుడు, కర్రి యుగేంద్ర, షేక్ సలీం, ముమ్మన ఆదిత్య, బొద్దాం గ్రామానికి చెందిన మహమ్మద్ అమీద్‌లతో పాటు పాటూరు గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలుడు ముఠాగా ఏర్పడి ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగిలిస్తున్నట్లు తెలిసిందన్నారు.

ముందస్తు సమాచారంతో మాటు వేసి..

ముఠా సభ్యులు చోరీ చేసిన సొత్తును విశాఖపట్నంలో అమ్మేందుకు ఆటోలో తరలించేందుకు పాటూరు జంక్షన్‌లో సిద్ధంగా ఉన్నట్లు అందిన సమాచారం మేరకు వేపాడ, ఎల్.కోట ఎస్సైలు సుదర్శన్, నవీన్‌పడాల్‌లు తమ సిబ్బందితో మాటు వేసి పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం విచారణలో నిందితులు నేరం అంగీకరించడంతో వారి నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన ట్రాన్స్‌ఫార్మర్లలో గల కాపర్ వైర్లు, బ్యాటరీలు, సబ్‌మెర్సిబుల్ మోటార్లు, అల్యూమినియం విద్యుత్ తీగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కొత్తవలస కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్.కోట, వేపాడ, జామి ఎస్సైలు నవీన్‌పడాల్, సుదర్శన్, వీరజనార్దన్, పలువురు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ మార్గదర్శకాలను అమలు చేయాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: జల్‌జీవన్ మిషన్ ఇచ్చిన మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అన్నారు. జాతీయ జల్‌జీవన్ మిషన్ సభ్యుల సూచనల మేరకు కార్యక్రమం అమలులో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను సరిచేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. జాతీయ జేజేఎం అడిషనల్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్లు జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్ డబ్ల్యూఎస్ ఎస్.ఈ. కవిత పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ నిర్వహణ సక్రమంగా ఉండాలి

- బీజేపీ, జనసేన నాయకుల డిమాండ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ, జనసేన నాయకులు

నెల్లిమర్ల: నెల్లిమర్లలోని అన్నా క్యాంటీన్ సిబ్బంది నిర్వాకం వల్ల పేదలకు అందాల్సిన ఆహార పదార్థాలు పక్కదారి పడుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు మైపాడ ప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన జనసేన మండల అధ్యక్షుడు పతివాడ అచ్చింనాయుడు, జనసేన నాయకుడు మజ్జి రాంబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నడిపేన నారాయణమూర్తితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెల్లిమర్లలోని అన్నాక్యాంటీన్‌లో టిఫిన్, భోజనం పేదలకు అందకుండా పక్కదారి పడుతోందని విమర్శించారు. అన్నా క్యాంటీన్‌లో పార్శిల్ కట్టే నిబంధన లేకున్నా సిబ్బంది కొంతమందికి పార్శిల్ చేస్తున్నారని, దీంతో పేదలకు ఆహారం అందడం లేదన్నారు. ఉదయం టిఫిన్ 9 గంటలకు వరకూ ఉండాల్సి ఉన్నా పార్శిల్స్ కట్టడం వల్ల 7.30 గంటలకే పూర్తవుతోందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహార పదార్థాలు అందే విధంగా చూడాలని కోరారు.

సాక్షిపై అక్కసు తగదు

నెల్లిమర్ల రూరల్: వాస్తవ పరిస్థితులు తెలియజేస్తున్న సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం అక్కసు పెంచుకోవడం తగదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తనిఖీలు చేయడం సరికాదన్నారు. ప్రజా సమస్యలను నిత్యం వెలుగులోకి తెస్తున్న పత్రికలపై, సాక్షిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇటీవల ఏలూరులో కూడా సాక్షి కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారన్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించరాదని హితవు పలికారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


రాంబాబు మృతదేహం

గుర్ల: భార్య తరచూ అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో మానసిక అవేదన చెందిన భర్త రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్ల మండలంలోని వల్లాపురంలో గురువారం ఈ ఘటన జరిగింది. గుర్ల మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన రుంకాన రాంబాబు (29)కు రెండు నెలల క్రితం అదే మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన వాణిశ్రీతో వివాహం జరిగింది. వివాహం జరిగినప్పటి నుంచి భార్య అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో రాంబాబు మానసికంగా అవేదన చెందుతుండేవాడేని కుటుంబసభ్యులు తెలిపారు. భార్య వాణిశ్రీని తీసుకువెళ్లడానికి కెల్ల బయలుదేరిన రాంబాబు జమ్ముపేట రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో యువకుడు..


తోటలో ఫణీంద్ర మృతదేహం

బలిజిపేట: మండలంలోని గౌరీపురం సమీపతోటలో కె.ఫణీంద్ర (27) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి తమ్ముడు సిద్ధార్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సింహాచలం కేసు నమోదు చేశారు. ఫిర్యాదు మేరకు రాజాం మండలం పెనుబాక గ్రామానికి చెందిన కె.ఫణీంద్రకు వ్యక్తిగతంగా ఉన్న అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ నిందితుల ఆరెస్టు


పట్టుబడిన నిందితులు, మద్యం సీసాలను చూపిస్తున్న సీఐ షణ్ముఖ రావు తదితరులు

కొత్తవలస: మండలంలోని రాజా సినిమాహాల్ సమీపంలో గల 202 కాలనీ వద్ద ఉన్న మద్యం దుకాణంలో గత నెల 28వ తేదీన దొంగలు చొరబడి తాళాలు విరగ్గొట్టి 240 మద్యం సీసాలను ఎత్తుకు పోయారు. కాగా అప్పట్లో సీఐ సీహెచ్.షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కొత్తవలస ఆర్చి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న 202 కాలనీకి చెందిన ఇద్దరు పాత నేరస్తులను గురువారం అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరం అంగీకరించినట్లు సీఐ తెలిపారు.ఈ మేరకు పి.యోహాను, పి.దర్శన్‌బాబు, పి.యేసులుగా నిందితులను గుర్తించినట్లు చెప్పారు. ప్రస్తుతం యేసు పరారీలో ఉన్నాడని మిగిలిన ఇద్దరు నిందితుల దగ్గర కొన్ని మద్యం సీసీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం కొత్తవలస కోర్టులో నిందితులను హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు. కార్యక్రమంలో ఎస్సై మన్మథరావు, ఏఎస్సై యువరాజు, పలువురు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

హైరిస్క్ గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయాలి

- డీఎంహెచ్‌వో భాస్కరరావు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

సీతంపేట: హైరిస్క్ మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఫీవర్ సర్వే పకడ్బందీగా చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక ఐటీడీఏలోని సీతంపేట, కుశిమి, దోనుబాయి, మర్రిపాడు, బత్తిలి, భామిని తదితర పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్వరం, ఇతర వ్యాదులు ఉన్న వారికి వెంటనే తగిన ట్రీట్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికీ ఐఆర్‌ఎస్ 5 శాతం ఏసీఎం ద్రావణాన్ని స్ప్రేయింగ్ చేయాలని చెప్పారు. ఫాగింగ్ వంటి యాక్టివిటీస్ చేయాలని కోరారు. దోమకాటు వ్యాధులపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏసీటీ, క్లోరోక్విన్, ప్రైమాక్విన్ వంటి యాంటీ మలేరియా మందులు సమృద్ధిగా అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఉపవైద్యాశాఖాధికారి కె.విజయపార్వతి, డీఎంవో సత్యనారాయణ, సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క సిలిండర్‌తో సరి..!

- ఏడాదికి మూడు ఇస్తామని ఎన్నికల్లో హామీ
- జిల్లాలో ఉచిత గ్యాస్ లబ్ధిదారులు 5,02,654 మంది
- మొదటి విడత వినియోగించుకున్న వారు 4,43,334 మంది

విజయనగరం ఫోర్ట్: అధికారం కోసం కూటమి సర్కార్ అనేక హామీలను ప్రజలకు ఇచ్చింది. అలవికాని హామీలు అయినప్పటికీ ప్రజలను బాగా నమ్మించింది. అందులో మహిళలను ప్రభావితం చేసింది ఉచిత గ్యాస్ పథకం. ప్రతి ఏడాదీ మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని ఊరూరా గొప్పగా ప్రచారం చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. 2024-25లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో చెప్పిన విధంగా 2024-25 సంవత్సరంలోనే మూడు సిలిండర్లు ఇవ్వాలి. కానీ 2024-25 మార్చి నెల లోపు ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చి సరిపెట్టేశారు. అంటే ఒక ఏడాదిలో ఇవ్వాల్సిన మూడు సిలిండర్లకు గాను రెండు సిలిండర్లకు ఎగనామం పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది కోట్లాది రుపాయల భారం తగ్గించుకునే ఎత్తుగడ అనే విమర్శలు సర్వత్రా వినినిస్తున్నాయి.

గుర్తించిన లబ్ధిదారులు 5.02 లక్షలమంది

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు 7 లక్షలకు పైగా ఉన్నాయి. ప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్‌కోసం గుర్తించిన లబ్ధిదారులు 5,02,654 మంది. ఇందులో 2024-25 సంవత్సరానికి సంబంధించి 4,46,846 మంది గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్నారు. 55,808 మంది గ్యాస్ బుక్ చేసుకోలేదు.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు:

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు 7,04,273 ఉన్నాయి. అందులో జనరల్ గ్యాస్ కనెక్షన్లు 3,46,455. అదేవిధంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు 1,29,277, సీఎస్ఆర్ కనెక్షన్లు 34,287 ఉన్నాయి. దీపం కనెక్షన్లు 1,85,254 ఉన్నాయి.

ఉచిత గ్యాస్‌పై కొత్త భాష్యం

ఉచిత గ్యాస్‌పై ప్రభుత్వం కొత్త భాష్యం చెబుతోంది. ఏడాదికి మూడు సిలిండర్లపై ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలు పొంతన లేకుండా ఉంటున్నాయి. 2024-25 లో ఇవ్వాల్సిన మూడు సిలిండర్లకు ఆ ఏడాదిలో ఒక్క సిలిండర్ మాత్రమే ఇచ్చారు. కానీ నవంబర్ 2024 నుంచి నవంబర్ 2025 లోగా మూడు సిలిండర్లు ఇస్తామని కూటమి సర్కార్ చెబుతుంది. ఇలా అయితే 2024వ సంవత్సరానికి సంబంధించి రెండు సిలిండర్లు ఎగనామం పెట్టినట్లేననే లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

లబ్ధిదారుల్లో కోత

వివిధ కారణాలతో కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ రాయితీని తగ్గించుకోవాలనే చూస్తోందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ బిల్లు ఎక్కువగా వచ్చిందని కొందరికి, ఇంట్లో అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ కార్యకర్త వంటి చిరుద్యోగులు ఉన్నారని మరి కొందరికి ఇలా అనేక కారణాలతో లబ్ధిదారులకు అందించాల్సిన ఉచిత రాయితీని ప్రభుత్వం ఎగ్గొంటేందుకు ప్రయత్నిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


పట్టణంలో గ్యాస్ డెలివరీ చేస్తున్న సిబ్బంది

మూడు సిలిండర్లుగా పరిగణన

2024-25 నవంబర్ నుంచి 2025-26 నవంబర్ నాటికి మూడు సిలిండర్లుగా పరిగణిస్తున్నాం. 2024-25 నవంబర్ నుంచి మార్చి 2025 నాటికి ఒక సిలిండర్ అందజేశాం.

కె.మధుసూదన రావు,
జిల్లా పౌరసరఫరాల అధికారి

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం?

- రూ.2 వేల నుంచి రూ.5వేల వరకు వసూలు
- వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు

విజయనగరం క్రైమ్: విజయనగరంలో కాల్‌మనీ బాగోతం వెలుగుచూసింది. నగరంలోని జొన్నగుడ్డికి చెందిన కనకమహాలక్ష్మి అనే బాధితురాలు విజయనగరం వన్‌టౌన్ స్టేషన్‌లో గతనెలలో ఫిర్యాదు చేయడంతో గురువారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. విజయనగరం వన్‌టౌన్ సీఐ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని జొన్నగుడ్డికి చెందిన దన్నాన రాంబాబు అనే వ్యక్తి మాన్సాస్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి దగ్గర రూ.2 వేల నుంచి రూ.5వేల వరకు దాదాపు 20 మంది దగ్గర వసూలు చేశాడు. ఇదే విషయమై డబ్బు కట్టిన బాధితులంతా ఉద్యోగాలు రాకపోవడంతో సరాసరి అశోక్ బంగ్లాకు వెళ్లి ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఉద్యోగాలు ఇప్పిస్తామంటున్న బాగోతం నమ్మవద్దని, అసలు బంగ్లాలో అటువంటి వాటికి తావేలేదని బంగ్లా సిబ్బంది కొట్టిపారేశారు. అలాగే డబ్బు కట్టిన బాధితులందరూ నేరుగా ఎంవీజీఆర్ కాలేజీకి వెళ్లి వాకబు చేయగా అక్కడ కూడా కాలేజీ సిబ్బంది, పీఆర్వోలు ఉద్యోగాలు ఖాళీలు ఏవీ లేవని చెప్పి తిప్పి పంపేశారు.

డబ్బులు వడ్డీకిచ్చాం

ఈ క్రమంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావును ప్రశ్నించగా ఫిర్యాదు మేరకు ఇరువర్గాల వారిని స్టేషన్‌కు పిలిపించి నిజాలు కనుక్కునే ప్రయత్నం చేస్తున్నామని సమాధానమిచ్చారు. ఇదిలా ఉండగా తాము వడ్డీకి డబ్బులు ఇచ్చామని సదరు వ్యక్తి అడ్రస్ గల్లంతైందని దానిపైనే ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వచ్చామని బాధితులు చెప్పడం విశేషం.

హోంగార్డు కుటుంబానికి చేయూత

- రూ.3 లక్షల చెక్ అందజేసిన ఎస్పీ


హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, చిత్రంలో హోంగార్డు సుందర్ రావు

విజయనగరం క్రైమ్: హోంగార్డుగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన బి.సుందర్ రావుకు చేయూత కింద రూ.3,25,180 చెక్కును ఎస్పీ వకుల్ జిందల్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమష్టిగా పోలీస్ శాఖలోని ప్రతి ఒక్క సిబ్బంది డ్యూటీ అలవెన్స్ కింద పోగు చేసిన సొమ్మును చేయూత కింద ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇది ఒక రకంగా పోలీస్ శాఖలో స్ఫూర్తిని నింపినట్లేనని ఎస్పీ అభిప్రాయ పడ్డారు. చేయూత పథకాన్ని, దాన్ని సిబ్బంది అమలు చేస్తున్న తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ టి.ఆనందబాబు, ఆర్‌ఎస్సై రమేష్ కుమార్, సూపరింటెండెంట్ రామకృష్ణ, పీఆర్‌ఓ కోటేశ్వరరావు, ఫొటోగ్రాఫర్ కృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో: ఒకరికి గాయాలు


తీవ్రగాయాల పాలైన సూర్యవంశీ


గంగారాంను 108లో తరలిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒమ్మి గ్రామానికి చెందిన పడాల సూర్యవంశీ గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఒమ్మి గ్రామం నుంచి శ్రీకాకుళం ఆటోలో మామిడిపళ్లు తీసుకువెళ్తున్నారు. బొబ్బిలి జంక్షన్‌కు వచ్చేసరికి డివైడర్‌ను ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న సూర్యవంశీ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108కు సమాచారం అందించగా హుటాహుటిన వచ్చి క్షతగాత్రుడికి ఈఎంటీ ఆలుగుబిల్లి శ్రీనివాసరావు, పైలెట్ శంకరరావులు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్‌కు గాయాలు

మండల పరిధి శ్రీకాకుళం రోడ్డులోని రెండో మైలురాయి వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో పొగిరి గ్రామానికి చెందిన పొగిరి గంగారాం తీవ్ర గాయాలపాలయ్యాడు. గంగారాం రాజాం నుంచి స్వగ్రామం పొగిరి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఒక్కసారిగా బైక్ అదుపు తప్పగా రోడ్డుపై పడిపోయాడు. పొగిరి గ్రామానికి చెందిన గంగారాం బొద్దాం పీహెచ్‌సీ సీనియర్‌లో అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ ఎ.శ్రీనివాసరావు, పైలెట్ శంకరరావులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం తరలించారు.

హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష తగదు

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె. రాణి


వీధి నాటకాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష తగదని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి అన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాన్ని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది, వ్యాధి సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటే హెచ్‌ఐవీ బారిన పడకుండా ఉండవచ్చాన్నారు. హెచ్‌ఐవీ సోకిన తర్వాత బాధపడేకంటే రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, ఐసీటీసీ సూపర్ వైజర్ సాక్షి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న జాతీయ పురస్కారాలు - 2025 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న డాక్టర్ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా 25వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని మారుమూల పల్లెలు, పట్టణాల్లో మట్టిలో మాణిక్యాల్లా మిగిలిపోయిన విద్యావంతులు, ఉపాధ్యాయులు, సమాజ సేవకులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, కార్మికులు, కర్షకుల సేవలను గుర్తించి వారికి పురస్కారాలను అందజేస్తామన్నారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థుల నిరసన

విజయనగరం గంటస్తంభం: డీఎస్సీ అభ్యర్థులకు వయో పరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని, జిల్లాకు ఒకే పేపర్ విధానం ఉండాలని కోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్ హరీష్ ఆధ్వర్యంలో విజయనగరం కోట కూడలి వద్ద గురువారం ఆందోళన చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం సంవత్సరాల తరబడి నిరుద్యోగులు ఎదురుచూశారన్నారు. పరీక్షకు సిద్ధమయ్యేందుకు కనీసం 90 రోజులు సమయం లేకపోవడం ఆందోళనకు గురవుతున్నామన్నారు. వయోపరిమితి 44 సంవత్సరా లే కావడంతో చాలామంది వయో భారంతో అర్హత కోల్పోతున్నట్లు వెల్లడించారు. ఓపెన్ డిగ్రీలో పాస్ అయిన వారికి కూడా అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాము, భాను, ఈశ్వరరావు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

గంట్యాడ: పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని పెదమజ్జిపాలెం పీహెచ్‌సీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఈడీడీ చార్టస్‌ను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నెలకు పది వరకు ప్రస వాలు నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీ లో సుఖ ప్రసవాలు చేస్తామన్న నమ్మకాన్ని గర్భిణులకు కలిగించాలని అన్నారు. అప్పుడే గర్భిణులు ఆసుపత్రిలో ప్రసవాలు చేసుకునేందుకు ముందుకు వస్తారన్నారు. అదే విధంగా ఓపీ సంఖ్యను పెంచాలన్నారు. మాతృ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నా రు. ప్రసవ తేదీకి మూడు నాలుగు రోజుల ముందే గర్భిణులు ఆసుపత్రుల్లో చేర్పించాల న్నారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. తరువాత తామరపల్లి లో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పల్లవి, సతీష్ పాల్గొన్నారు.